క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్టకు హాజరైన ఎమ్మెల్యే



విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు రూరల్: మండలంలోని కోవూరు పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరయ్యారు. వేద మంత్రాలతో ఎమ్మెల్యేను ఆహ్వానించారు. విగ్రహ ప్రతిష్టలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుడ్లూరు: మండలంలోని మొగుళ్లూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 6,7,8 ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ కిలారు సింధు తెలిపారు. 6 వతరగతిలో 40, 7వ తరగతిలో 2, 8వ తరగతిలో 1, ఇంటర్(హెచ్‌ఈసీ)40 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు, ఎస్టీ,ఎస్సీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు సోమవారం నుంచి ఏప్రిల్ 20 వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులతో పాటు కుల, ఆదాయ, స్టడీ, రేషన్ కార్డు జెరాక్స్‌లు జత చేయాలన్నారు. ఎంపికైన బాలికలకు మెసేజ్‌ల ద్వారా సమాచారం అందిస్తామని తెలిపారు.

737 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రం పరిధిలో సోమవారం నిర్వహించిన వేలంలో 737 పొగాకు బేళ్లు కొనుగోలయ్యాయి. కారుమంచి గ్రామానికి చెందిన రైతులు 793 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 737 కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 23 తిరస్కరించారు. గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.170 పలకగా, సరాసరి రూ.192.04 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 14 మంది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

31న బహిరంగ వేలం

కందుకూరు అర్బన్: కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో దినవారి మార్కెట్, చేపలు, మాంస మార్కెట్‌లకు చెందిన రుసుం వసూళు చేసుకునేందుకు ఈ నెల 31న మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. పాటలో పాల్గొనేవారు పురపాలక సంఘానికి ఎటువంటి బకాయిలు ఉండకూడదన్నారు.

118 మందికి వైద్య పరీక్షలు



నల్లగండ్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్లగండ్ల, మాలపాటివారిపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో 118 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ ప్రతాపురెడ్డి, వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉలవపాడుకు మాదిగల సంగ్రామ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఉలవపాడు: ఎస్సీ రిజర్వేషన్‌లను వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్సీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాసు మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర సోమవారం ఉలవపాడు మండలం బద్దిపూడి భీమవరం చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న ద్వంద విధానాలను విడనాడాలన్నారు. పాదయాత్రలో మహాజన సోషలిస్ట్ పార్టీ ఉలవపాడు మండల అధ్యక్షుడు రావినూతల ముత్తు మాదిగ, మండల ఎమ్మార్పీస్ నాయకులు మనోహర్, రమేష్, జాన్‌వెస్లీ, పుల్లయ్య, రాజేష్, ఏలియా, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు మహిళలు

సీఎం జగన్‌తోనే మహిళాభ్యుదయం

వెలిగండ్ల: మహిళలను మహారాణులుగా చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు పొదుపు గ్రూపుల అక్కాచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా కింద నగదును జమ చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా కింద వెలిగండ్ల మండలంలో రూ.12.66 కోట్లు మూడు విడతల్లో జమ చేశారన్నారు. మూడో విడత రూ.4.22 కోట్లు పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేశారన్నారు. గతంలో చంద్రబాబు రుణమాఫీ పేరుతో మహిళలను వంచించారన్నారు. ప్రస్తుతం రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, కుల వృత్తుల వారిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికంగా ఆదుకుంటుంటే ఎల్లో మీడియా ఓర్వలేక నిప్పులు కక్కుతున్నాయన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అప్పులు కూడా సీఎం జగన్ తీరుస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న మన సున్న మారాజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా రుణపడి ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామన మహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, వైఎస్ ఎంపీపీ టి.మేరిపుష్ప, ఎంపీడీఓ టి.సుకుమార్, సర్పంచ్ టి.సురేష్‌బాబు, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం, జార్జి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ టి. దేవసహాయం, ఆరెకటిక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దాదా లక్ష్మీకుమారి, ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్, ఏపీఎం లక్ష్మీనారాయణ, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, డైరెక్టర్ టి.నాని, ఎంఈఓ దాసుప్రసాద్, కోఆప్షన్ సభ్యులు హమీద్, ఎంపీటీసీ సభ్యులు డి.జనార్దన్, పి.స్వప్న, వైఎస్సార్ మండల నాయకులు వై నాగూర్‌యాదవ్, యెలికె రమణయ్య, యెలికె నారాయణ, ఆదిరెడ్డి, చెన్నకృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

మర్రిపూడి: ఏపీఎస్ ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలని పొదిలి డిపో మేనేజర్ సుందరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వికలాంగులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్‌పాస్‌లు అవసరమైన వికలాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారన్నారు. మండలంలో సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులకు మంగళవారం పొదిలి ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ బస్‌పాస్‌లు అందజేస్తారన్నారు. ఈ బస్‌పాస్‌లు రాష్ట్ర వ్యాప్తంగా మూడేళ్లపాటు చెల్లుబాటవుతాయన్నారు. అలాగే పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం సకాలంలో బస్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వికలాంగుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనిపెంట గురవారెడ్డి, వికలాంగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ సుందరరావు

29న మండల సమావేశం

లింగసముద్రం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషుబాబు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

రోడ్డుపై ఉన్న కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలు తొలగిస్తున్న దృశ్యం

హనుమంతునిపాడు: కంభం కనిగిరి రహదారి విస్తరణలో భాగంగా వేములపాడు సెంటర్ బస్టాండ్‌లో రోడ్డు పక్కన ఇరువైపులా ఉన్న కట్టడాలను సోమవారం జేసీబీతో తొలగింపు చేశారు. డబుల్ రోడ్డు విస్తరణ సందర్భంగా పనులు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ రోడ్డు అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం గ్రామాల్లో రోడ్డు మీదకు ఉన్న కట్టడాలు, బంకులు, హోటళ్లు, షాపులు తొలగిస్తున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం

పామూరు: మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు కోదండరామస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన దాత కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కుటుంబసభ్యులు ఇటీవల విరాళం ప్రకటించారు. ఈసందర్భంగా సోమవారం ఆయన నివాసగృహంలో రూ.10,01,116 చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన పలువురు విరాళాలు ఇవ్వాలని కోరారు. ఈసందర్భంగా రు.10 లక్షల విరాళం అందజేసిన దారపనేని చంద్రశేఖర్‌ను దేవస్థాన కమిటీ అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పామూరు సింగిల్‌విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి, పచ్చవ వెంగయ్య, తిరివీధి కేశవరావు, హజరత్, దారపనేని నరసింహనాయుడు పాల్గొన్నారు.



విరాళం చెక్కును ఆలయ కమిటీకి అందజేస్తున్న దాత చంద్రశేఖర్

మిరపలో కాయకుళ్లును నివారించాలి

మర్రిపూడి: మిరప పంటకు ఆశించే కాయకుళ్లును నివారించాలని మండల హార్టీకల్చర్ అధికారి డీ సంధ్య అన్నారు. మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో సాగుచేసిన మిరప పంటను ఆమె పరిశీలించారు. అకాల వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అధిక తేమ వల్ల పంటపై ఉన్నకాయలకు కాయకుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్తగా 2.5 మాంకోజాబ్ లేదా 2 గ్రాములు క్లోరోత్తలోనిల్ లేదా తయోఫినైట్ మిథైల్ 2 గ్రాములు పిచికారి చేయాలన్నారు. తెగుళ్ల ఉధృతిని నివారించడానికి డైఫన్‌కోనజోల్ 0.5 ఎంఎల్ లేదా ప్రొపికోనజోల్ ఒక మి.లీ పిచికారి చేయాలన్నారు. ఎండబెట్టేటప్పుడు కాయకుళ్లు ఆశించిన కాయలను వేరుచేసి విడివిడిగా ఎండ బెట్టుకోవాలని రైతులకు సూచించారు.



మిరప కాయలను పరిశీలిస్తున్న హెచ్‌ఓ సంధ్య

వైద్యాధికారిగా రాహుల్‌క్రిష్ణ

గుడ్లూరు: మండలంలోని చేవూరులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి రెండో వైద్యాధికారిగా రాహుల్ క్రిష్ణ సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. మండల వైద్యాధికారి మారుతీరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, ఇంటింటా వైద్యం–ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికి వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేవూరులో నూతన ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. రెండు రోజులు క్రితం సబీహా సుల్తానా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించగా రెండో వైద్యాధికారిగా రాహుల్ క్రిష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇద్దరు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న పొగాకు పట్టివేత

టంగుటూరు: అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు టంగుటూరు మండలం పొందూరు గ్రామం నుంచి మినీ వ్యాను, మల్లవరప్పాడు గ్రామం నుంచి మినీ లారీలో మేలిమి రకం పొగాకు, పండుగుళ్ల, పొగాకు సూర బేళ్లను తరలిస్తున్నారని సమాచారం రావటంతో ఆయా గ్రామాల్లో స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను అక్కడి నుంచి స్థానిక వేలం కేంద్రానికి తరలించారు. మేలిమి రకం 16 బేళ్లు, పండుగుల్ల 43 బేళ్లు, సూర గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.1.20 లక్షల వరకు ఉంటుందన్నారు. దాడిలో విజిలెన్సు టీం లీడర్ యోగేష్ గౌడ్, జస్వంత్ ఉన్నారు.



టంగుటూరులో స్వాధీనం చేసుకున్న పొగాకును చూపుతున్న విజిలెన్స్ అధికారులు

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

పామూరు: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులో కోత విధించి తద్వారా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులను యజమానులకు బానిసలు చేయాలని చూస్తుందన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీఎం వైఎస్ జగన్‌ని కలిసిన వైఎం ప్రసాద్‌రెడ్డి

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం ప్రసాద్‌రెడ్డి సోమవారం కలిశారు. కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి వచ్చిన సీఎంని కలిసినట్లు తెలిపారు.



సీఎంకి నమస్కరిస్తున్న వైఎం ప్రసాద్‌రెడ్డి

వైభవంగా పోలేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్టించిన పోలేరమ్మ తల్లి



హాజరైన భక్తులు

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రంలో మూడు రోజుల నుంచి గ్రామస్తులు గ్రామ దేవతలను ప్రతిష్టించారు. సోమవారం గ్రామ దేవత పోలేరమ్మ తల్లిని ప్రతిష్టించారు. పూజారి ఓర్వగంటి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో 15 మంది వేద మంత్రాలతో గ్రామ దేవతలను ప్రతిష్టించారు. ఈ ఏడాది వర్షాలు మంచిగా కురిశాయని, పాడి పంటలు సమృద్ధిగా పండాయని, పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర వచ్చిందని సుఖ సంతోషాలతో పిల్లా పాపలు, కుటుంబ సభ్యులతో దేవతను మొక్కుకున్నారు. వచ్చే ఏడాది కూడా సమృద్ధిగా వర్షాలు కురిసి గ్రామాన్ని కాపాడాలని మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో ఇతర గ్రామాల నుంచి భక్తులు విచ్చేశారు. అన్నదానం చేశారు.

ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోండి



చింతలపాలెం ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

జరుగుమల్లి (సింగరాయకొండ): మండల ప్రజలు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పీ రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆధార్ నమోదు లేని వారిని గుర్తించి అందరికీ ఆధార్ నమోదు చేయాలని, ఇందుకు గ్రామ వాలంటీర్ల సహకారం తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యాలయ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ మహిళలకే సాధ్యం



వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి, పీడీ

- బ్యాంక్ రుణాలు నూరుశాతం రికవరీ
- ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు రూరల్: మహిళలు ఆర్థిక క్రమశిక్షణ కారణంగా రాష్ట్ర తలసరి ఆదాయం పెరిగిందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఎంత ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారో బ్యాంక్ లీకేజీ రుణాలు రికవరిలోనే తెలిసిపోతుందన్నారు. మండలంలో నూటికి నూరుశాతం రికవరీ అయిందంటే వారి క్రమశిక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. అదే విధంగా స్త్రీ నిధి రుణాలు 99 శాతం రికవరీ అయిందన్నారు. ఈ క్రమశిక్షణ చూసే బ్యాంకులు రుణాలు ఇస్తామని పరుగులు తీసుకున్నారని తెలిపారు. గతంలో 5 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఇచ్చేవారు కాదన్నారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకులకు ఇచ్చిన భరోసా ప్రకారం రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారంటే మహిళల ఆర్థిక క్రమశిక్షణే కారణమన్నారు. గత ప్రభుత్వాలు బ్యాంకు రుణాలు మీరు కట్ట వద్దని, మాఫీ చేస్తానని హామీ చేస్తామని చెప్పి చెల్లించకపోవడంతో ఏ గ్రేడ్ నుంచి బీ, సీ గ్రేడ్‌లకు పడిపోయాయని తెలిపారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ కూడా ఆర్థిక క్రమశిక్షణ తప్పకుండా ఉండేందుకు బ్యాంకులో తీసుకున్న రుణాలు మీరు చెల్లించండి ఎన్నికల సమయానికి ఎంత రుణం ఉందో అంత విడతల వారీగా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అందులో భాగంగానే వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడో విడత నగదును ఆయా ఖాతాలో జమ చేస్తున్నట్లు చెప్పారు. కందుకూరు మండలంలో 854 స్వయం సహాయక సంఘాలకు రూ.7.15 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. నవరత్నాలలో ఇచ్చిన పథకాల్లో కాకుండా అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునందించారన్నారు. రూ.7.15 కోట్ల వైఎస్సార్ ఆసరా, రూ.3.50 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను చెక్కులను మండల సమాఖ్యకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎల్‌డీఓ పద్మజ, తహసీల్దార్ డి.సీతారామయ్య, ఎంపీడీఓ పి.విజయశేఖర్, జెడ్పీటీసీ తొట్టెంపూడి అనసూర్య, ఎంపీపీ ఇంటూరి సుశీల, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.జయమ్మ, ఏపీఎం టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు ధీమా వైఎస్సార్ బీమా

పామూరు: వైఎస్సార్ బీమా పథకం పేదలకు అండగా నిలుస్తూ వారికి ధీమానిస్తోందని వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయి కిరణ్ అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కొండూరి కాంతారావు అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడు వైఎస్సార్ బీమాలో సభ్యుడై ఉండగా మంజూరైన బీమా నగదును సోమవారి మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. పంచాయతీ సిబ్బంది రత్నకుమార్, జయమ్మ, పోలు బాలిరెడ్డి, ఒగూరి ఏడుకొండలు, పోలు మల్లికార్జునరెడ్డి, అబ్బారెడ్డి రత్నం, ఎం రవి పాల్గొన్నారు.



బీమా నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పన్ను బకాయిలు చెల్లించండి

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులు ఈ నెల చివరినాటికి చెల్లించి వడ్డీమాఫీ పొందాలని బకాయిదారులను కమిషనర్ ఎస్. మనోహర్ కోరారు. పట్టణంలోని పట్టణంలో పన్నుల వసూళ్లపై సోమవారం 1వ సచివాలయం పరిధిలోని 4వ వార్డులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వడ్డీ మాఫీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం పన్నులు సకాలంలో చెల్లించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్నుల చెల్లింపు కోసం సెలవు దినాల్లో కూడా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లు తెరిచే ఉంటుందని తెలిపారు.



వడ్డీమాఫీపై అవగాహన కలిగిస్తున్న కమిషనర్ మనోహర్

ఉపాధి హామీ పథకంతో ప్రతి ఒక్కరికీ పని

- డ్వామా పీడీ శీనారెడ్డి

జరుగుమల్లి (సింగరాయకొండ): గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ పని కల్పించడమే లక్ష్యమని ఆ ప్రకారం జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నామని డ్వామా పీడీ శీనారెడ్డి అన్నారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.7 కోట్లతో జరిగిన 200 పనులపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఎవెన్యూ ప్లాంటేషన్ ద్వారా సుమారు 9 వేల మొక్కలు నాటగా వాటిలో 5 వేల మొక్కలు పని ప్రదేశంలో లేవని సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఆరోపించారు. మిగిలిన పనులకు సంబంధించి రికార్డుల ప్రకారం వేతన చెల్లింపులు జరిగాయని సామాజిక తనిఖీ సిబ్బంది ధ్రువీకరించారు. జిల్లా విజిలెన్స్ అధికారి బీ వెంకటస్వామి, అంబుడ్స్‌మెన్ మీరావలి, ఎంపీడీవో పీ రామకృష్ణ, ఏపీవో కే నాగరాజు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ శీనారెడ్డి

వల్లూరమ్మ దుకాణాల వేలం ఆదాయం రూ.32,500

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ దేవస్థానంలో ఆలయానికి చెందిన 7, 9 దుకాణాలు టెండర్, బహిరంగ వేలం సోమవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ బహిరంగ వేలం ద్వారా రూ.32,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బి.రమేష్ తెలిపారు. వేలం పాటలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వల్లూరమ్మ ఆలయంలో దుకాణాల వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు